క్లుప్తంగా

'నేడు గడప గడపకు మన ప్రభుత్వం'

జమ్మలమడుగు : పట్టణంలోని కన్నెలూరులో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్ రెడ్డి, చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మలు పాల్గొం టారని వార్డు కౌన్సిలర్ పోచిరెడ్డి తెలిపారు.

శోభాయాత్ర కరపత్రాలు విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

ఎర్రగుంట్ల : పట్టణంలోని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమాన్ జయంతి సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు. మే 14వ తేదీన జరగబోవు హనుమన్ జయంతి పురస్కరించుకుని శోభాయాత్రను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రతి హిందూవు ఈ శోభాయాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. పోతురాజు వద్ద ముద్దలను ఏరాటు చేసి జంతుబలులు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలోని పచ్చని చెట్ల మధ్య బంధుమిత్రులతో విందుభోజనాలను ఆరగించారు. ఆలయ సమీపంలోని ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జూదరుల అరెస్టు

వేంపల్లె : ఇడుపులపాయ గ్రామ సమీపంలోని మామిడి తోటల్లో పి.శివకృష్ణ, లోకేష్, జగదీష్, చంద్రశేఖర్, నాగరాజులు ఆదివారం జూదమాడుతుండగా అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.1400 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆర్కే వ్యాలీ ఎస్ఐ రంగారావు తెలిపారు. దాడుల్లో ఏఎస్ఐ నాగరాజు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

చిలంకూరు వాసికి అవార్డు

ఎర్రగుంట్ల : మండలం పరిధిలోని చిలంకూరు గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కన్నెలూరి గుర్రప్ప చేసిన విద్యాభివృద్ధికి, సమాజ సేవకు గాను మహాత్మా జ్యోతిరావ్ పూలే ఎక్సలెన్స్ టీచర్ అవార్డుకు ఎంపిక య్యారు. ఈ మేరకు ఆదివారం తిరుపతిలో జరిగినత పీటీఏ అసోసియేషన్ సమావేశంలో రిటైర్డ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ చేతుల మీదుగా అందుకున్నారు.

నవయుగ వైతాళికుడు కందుకూరి విరేశలింగం

జమ్మలమడుగు : నవయుగ వైతాళికుడు కందుకూరి విరేశలింగమని ఎంఈవో క్రిష్టఫర్ తెలిపారు. ఆదివారం డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐల ఆధ్వర్యంలో కందుకూరి విరేషలింగం జయంతి వేడుకలను స్థానిక పతంగే రామన్నరావు ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినయ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

అపార్టుమెంట్లలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కడప అర్బన్ : అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా కడప ఫైర్ స్టేషన్ అధికారి, జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి బసివిరెడ్డి ఆధ్వర్యంలో అగ్నిమాపక విన్యాసాలు నిర్వహించారు. కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో సత్యసాయి అపార్టుమెంటులో నివసిస్తున్న వారికి ఎల్‌పీజీ గ్యాస్ వల్ల కలిగే ప్రమాదాలను, విద్యుత్ కారణంగా సంభవించే అగ్ని ప్రమాదాలు, వాటిని ఎలా అరికట్టాలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిచేతే ప్రయోగాత్మకంగా నిర్వహించారు. ఎలాంటి అగ్ని ప్రమాదాలు సంభవించినా 101, 08562-242299, 99637 37191 నెంబర్లకు సమాచారం అందించాలని తెలియజేశారు.డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, కడప అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

మైదుకూరు : మైదుకూరులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశం కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వై.విజయ ఒక ప్రకటనలో తెలిపారు. హైస్కూల్‌లో 6వ తరగతి 40 సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీ 40 సీట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీపీఎల్ వర్గానికి చెందిన వారు, తల్లిదండ్రులు లేని అనాథలు దరఖాస్తు చేసుకోవలని వివరించారు. ఏప్రిల్ 30 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

వైఎస్ భాస్కర్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా శాంతియుత ర్యాలీలు

కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ నాయకులు



కమలాపురంలో రోడ్డుపై బైఠాయించిన వైఎస్సార్ సీపీ నాయకులు



జమ్మలమడుగులో ర్యాలీగా వస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పులివెందులలో స్వచ్ఛందంగా దుకాణాలను మూసిన వ్యాపారస్తులు

పులివెందుల : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి సీబీఐ అధికారులు పులివెందులలో వైఎస్ భాస్కర్‌రెడ్డి అక్రమ అరెస్టుకు నిరసనగా ఆదివారం ఉదయం వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి శాంతియుత ర్యాలీ నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా పూలంగళ్ల సర్కిల్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, వైఎస్సార్‌సీపీ వేముల మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి, వైఎస్సార్‌సీపీ లింగాల మండల నాయకులు సారెడ్డి చంద్రశేఖరరెడ్డిలు మీడియాతో మాట్లాడుతూ వైఎస్ భాస్కర్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికమన్నారు. వివేకా హత్య కేసులో సీబీఐ అధికారులు సూత్రదారులు, పాత్రదారులను విడిచిపెట్టి వైఎస్ భాస్కర్‌రెడ్డిని టార్గెట్ చేయడం దుర్మార్గమన్నారు. వివేకా హత్య కేసులో కుట్ర కణం ఛేదించాలని సుప్రీం కోర్టు ఆదేశించినా.. పాత నివేదిక ఆధారంగా అరెస్టులు చేయడం కోర్టులను మోసగించడమేనన్నారు. సీబీఐ పూర్వపు విచారణ అధికారులు చేసిన నివేదిక ఆధారంగా అరెస్టులు చేయడం కోర్టులను తప్పుదోవ పట్టించడమేనని వాపోయారు. హత్య జరిగిన రోజు దొరికిన లేఖ దాచడం వెనుక నిజాలు బయటకు రావాలన్నారు. డబ్బుల కోసం మనిషి ప్రాణాలు తీసిన కిరాయి హంతకుడు దస్తగిరి లాంటి వ్యక్తి వాంగ్మూలాన్ని ఎలా ప్రామాణికంగా తీసుకుంటారన్నారు. వైఎస్ కుటుంబానికి మచ్చ తెచ్చేలా టీడీపీ ఆడిన కుట్రలో సీబీఐ పావుగా మారిందన్నారు. ఒక అబద్ధాన్ని పదే పదే చెప్పి ప్రజలను, అధికారులను తప్పుదోవ పట్టించే విధంగా పచ్చ మీడియా బ్యాచ్ చేసిన పన్నాగం ఇది అని విమర్శించారు. సీబీఐ విచారణ నుంచి కడిగిన ముత్యంలా వైఎస్ భాస్కర్‌రెడ్డి బయటపడతారని ప్రజలు ఆకాంక్షిస్తున్నారన్నారు. వివేకా హత్య కేసులో న్యాయం గెలవాలి.. నిజం బయటపడాలనేది వైఎస్ అవినాష్‌రెడ్డి ఆకాంక్ష ఇది అన్నారు. శాంతియుత ర్యాలీ సందర్భంగా పులివెందుల మెయిన్ రోడ్డులోని అంగళ్లను స్వచ్ఛందంగా వ్యాపారస్తులు మూతవేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

సీబీఐ ఏకపక్ష విచారణ తగదు

కమలాపురం : మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తండ్రి భాస్కర్‌రెడ్డిని అరెస్ట్ చేయడం దారుణం అని, సీబీఐ విచారణ ఏకపక్షంగా సాగుతోందని రాష్ట్ర ఉద్యాన సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాలమేర కు ఆదివారం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి స్థానిక వైఎ స్సార్ సీపీ కార్యాలయం నుంచి క్రాస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో క్రాస్ రోడ్డు వద్ద బైఠాయించారు. సీబీఐ డౌన్ డౌన్... భాస్కర్ రెడ్డిని విడుదల చేయాలి.. అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీని దెబ్బతీయాలని ప్రతిపక్ష నాయకులు కుట్ర పన్నారన్నారు. మాజీ మంత్రి డీఎల్ రెండు రోజుల క్రితమే ఈ అరెస్ట్ గురించి ముందే చెప్పారన్నారు. అంటే సీబీఐ చేసే ప్రతి పని ప్రతిపక్షాలకు ముందే తెలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్‌సీ పుల్లారెడ్డి, చెన్నకేశవరెడ్డి, వంశీధర్‌రెడ్డి, హిదాయత్, జగన్‌మోహన్ రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, నిఖిల్‌రెడ్డి, హీరామియ్య, అల్లె రాజారెడ్డి, మర్రి సుబ్బన్న, విజయేంద్రారెడ్డి, ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : వైఎస్ భాస్కర్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టి పాతబస్టాండ్‌లో గాంధీ విగ్రహం వద్ద రోడ్డుపై ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, హస్తకళల అభివృద్ధి చైర్మన్ బడిగించల విజయలక్ష్మీ, వివిధ మండలాలనుంచి వచ్చిన నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు వైఎస్ వివేకానందరెడ్డిని ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించేటందుకు వైఎస్ అవినాష్‌రెడ్డి తీవ్ర కృషి చేశారన్నారు. అలాగే వైఎస్ వివేకానందరెడ్డి వైఎస్ అవినాష్‌రెడ్డిని ఎంపీగా గెలిపించటానికి కృషిచేశారన్నారు. అలాంటి వారి మధ్య సఖ్యత తప్ప విబేధాలు లేవన్నారు. సీబీఐ అధికారులు న్యాయం వైపు నిలవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, హనుమంతరెడ్డి, కౌన్సిలర్లు ముల్లా జానీ, పోచిరెడ్డి, శ్రీరాములు, బడిగించల చంద్రమౌళి, జీకే బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ భాస్కర్‌రెడ్డి అరెస్ట్ దుర్మార్గం

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డిని సీబీఐ అధికారులు ఏకపక్షంగా అరెస్టు చేయడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ నాయకుడు హృషికేశవరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక తన నివాసంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. అసలు సీబీఐ ఎల్లోమీడియా కనుసన్నల్లో నడుచుకుంటుదే తప్ప స్వతంత్ర్యంగా దర్యాప్తు చేయడంలేదన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : వైఎస్ భాస్కర్‌రెడ్డి అరెస్టకు నిరసనగా పట్టణంలోని నాలుగురోడ్ల కూడలిలో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్‌రెడ్డిల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్లు మహమ్మద్ ఆలీ, ఎరికలరెడ్డి, డి.సూర్యనారాయణరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మహమ్మద్ రఫీ, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ ప్రతాప్‌రెడ్డి, ఉప మండలాధ్యక్షుడు మల్లు వెంకట మోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు గంగాకృష్ణారెడ్డి, జెక్కు చెన్నకృష్ణారెడ్డి, ఇస్మాయిల్, మల్లు కేశవరెడ్డి, కెవి సుబ్బారెడ్డి, గంగాధర్‌రెడ్డి, డెవిడ్, అబ్దుల్ గపూర్ తదితరులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : వైఎస్ భాస్కర్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా వీరపునాయునిపల్లెలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సంగమేశ్వర దేవస్థానం చైర్మన్ శివాంజనేయరెడ్డి, కమలాపురం మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గంగిరెడ్డి, వీరపునాయునిపల్లె ఎంపీటీసీ రాఘవయాదవ్, నాయకులు రవీంద్రనాథ్‌రెడ్డి, జంగంరెడ్డి, ప్రతాప్ యాదవ్, వీరయ్య యాదవ్, శ్రీనివాసుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : వైఎస్ భాస్కర్‌రెడ్డిని అరెస్టు చేయడం దుర్మార్గపు చర్య అని వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబుళరెడ్డిలు మండిపడ్డారు. అరెస్టుకు నిరసనగా స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి బస్టాండు వరకు వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద ఎత్తున నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. సీబీఐ నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో చక్రాయపేట మండల జెడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి, వేంపల్లె సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మీగాయత్రి, రాష్ట్ర డైరెక్టర్లు మునీర్, సల్మా, షబ్బీర్‌వలి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవిశంకర్ గౌడ్, అసానయ్య, మండల ఉపాధ్యక్షుడు బాబాషరీఫ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వేములలో..

వేముల : వైఎస్ వివేకా హత్య కేసులో వైఎస్ భాస్కర్‌రెడ్డిని సీబీఐ అరెస్టు చేయడం అప్రజాస్వామికమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ లింగాల ఉషారాణి అన్నారు. మండలంలోని వేల్పుల గ్రామంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వివేకా హత్య కేసులో అసలు దోషులను వదిలేసి ఇందులో ఎలాంటి సంబంధంలేని వైఎస్ భాస్కర్‌రెడ్డిని సీబీఐ అరెస్టు చేయడం దారుణమన్నారు. వివేకా హత్య కేసులో సీబీఐ వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని దర్యాప్తు చేస్తోందన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : వైఎస్ భాస్కర్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా ఆదివారం మైనార్టీ నాయకులు శాంతియుత ర్యాలీని సింహాద్రిపురంలో నిర్వహించారు. మైనార్టీ జిల్లా జాయింట్ సెక్రటరీ ముల్లా మహ్మద్, మాజీ కో ఆప్షన్ మెంబర్ మస్తాన్, సోషల్ మీడియా కో కన్వీనర్ ముల్లా బిలాల్, మైనార్టీ నాయకులు గౌస్‌పీర్, బహదూర్, ముబారక్, మహబూబ్‌బాషా, నయూమ్, ఇమ్రాన్, మహమ్మద్‌వలి తదితరులు పాల్గొన్నారు.



ఎర్రగుంట్లలో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



వేంపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వీరపునాయునిపల్లెలో ర్యాలీ చేపడుతున్న వైసీపీ నాయకులు



సింహాద్రిపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న మైనార్టీ జిల్లా నాయకులు

ముగిసిన వీరాంజనేయస్వామి తిరునాల

వల్లూరు : మూడు రోజులుగా జరుగుతున్న మండల పరిధిలోని పాపాఘ్ని నగర్ (కట్ట బస్టాపు) వద్ద వెలసిన శ్రీ పాపాఘ్ని వీరాంజనేయస్వామి తిరునాల మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, ఆకు పూజలను నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన చెక్క భజన కార్యక్రమం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది.



బండను లాగుతున్న ఎద్దులు

బండలాగుడు పోటీలు

తిరునాల సందర్భంగా ఆదివారం నిర్వహించిన బండలాగుడు పోటీల్లో వీరపునాయునిపల్లె మండలం తలపనూరుకు చెందిన గంగిరెడ్డి ఎద్దు, కొండాపురం మండలం బేరుదూరుకు చెందిన శ్రీనివాసులు ఎద్దు కలిసి 4360 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచాయి. కడప మండలం ఖాదర్‌ఖాన్‌కొట్టాలుకు చెందిన భావనశ్రీ ఎద్దులు 4354 అడుగులు లాగి రెండవ స్థానంలో, అనంతపురం జిల్లా యల్లనూరు మండలం చిల్లమకూరుకు చెందిన పుట్లూరు సుదర్శన్ ఎద్దులు 4227 అడుగులు లాగి మూడవ స్థానంలో నిలిచాయి. ప్రొద్దుటూరు మండలం నాగాయపల్లెకు చెందిన విజయ్‌కుమార్‌రెడ్డి ఎద్దులు నాలుగవ స్థానంలో, ఖాదర్‌ఖాన్‌కొట్టాలకు చెందిన భావన శ్రీ ఎద్దు, చెన్నూరుకు చెందిన వేద వంశీరెడ్డి ఎద్దు ఐదవ స్థానంలో, అనంతపురం జిల్లా పెద్ద పప్పూరు మండలం చాగల్లుకు చెందిన వై.ఆదినారాయణ ఎద్దులు ఆరవ స్థానంలో, వల్లూరు చిన్ననాగిరెడ్డిపల్లెకు చెందిన తారకరెడ్డి ఎద్దులు ఏడవ స్థానంలో నిలిచాయి. మొదటి బహుమతిని రూ.30 వేలను ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ద్వితీయ బహుమతి రూ.20 వేలను మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, మూడవ బహుమతి రూ.15 వేలను నారంగారి శంకర్‌రెడ్డి, నాలుగవ బహుమతి రూ.10 వేలను డీ వెంకటరావు, ఐదవ బహుమతి రూ.8 వేలను ఆది వేమయ్య, ఆరవ బహుమతి రూ.5,016లను గోసుల రమణారెడ్డి, ఏడవ బహుమతి రూ.3, 016 లను ఎల్.బాలగంగయ్య, బయన్న, సర్పంచ్, పాశం పెద్దక్క వితరణగా ఇచ్చారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

సింహాద్రిపురం : విద్యార్థులు చదువుతోపాటు సేవా కార్యక్రమాలలో ముందుండాలని వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం పీఓ డి.లక్ష్మికాంత తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని బలపనూరు గ్రామంలో సింహాద్రిపురం కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాల, వైవీయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు స్పెషల్ క్యాంపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం పీఓ లక్ష్మీకాంత హాజరై మాట్లాడుతూ బాలికల చదువు, బాల్య వివాహాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం బాలికల చదువు, బాల్య వివాహాల వ్యతిరేకతపై ర్యాలీ నిర్వహించారు. వారంరోజులపాటు బలపనూరు గ్రామంలో సేవా కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సునీత, విద్యార్థినులు పాల్గొన్నారు.

వైభవంగా అంకాలమ్మ జాతర

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మగూడూరులో వెలసిన అంకాలమ్మ దేవత జాతర ఆదివారం వైభవంగా నిర్వహించారు. జాతర సందర్భంగా ఆలయ చైర్మన్ అశోక్‌రెడ్డి భక్తులకు అన్ని అసౌకర్యాలు ఏర్పాటు చేశారు. అర్చకులు అనిల్‌కుమార్ శర్మ తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి సిరిబండిని ఆలయం చుట్టూ తిప్పారు. అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అనంతరం బండలాగుడు పోటీలను వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ మధురెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలలో 20 జతల ఎద్దులు పాల్గొన్నాయి. మొదటి బహుమతి కింద రూ.90 వేలను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, రెండవ బహుమతి కింద రూ.80వేలు మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మూడవ బహుమతి కింద రూ.70వేలు ఆలయ చైర్మన్ అశోక్‌రెడ్డి, నాల్గవ బహుమతి కింద రూ.60వేలు వైఎస్సార్‌సీపీ నాయకులు హరినాథరెడ్డి, మిగిలిన బహుమతులను దాతలు ఏర్పాటు చేశారు. పోటీలలో పాల్గొన్న ఎద్దులకు కన్సలేషన్ బహుమతులను ప్రదానం చేయనున్నారు. కార్యక్రమాల్లో ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, రుషికేశవరెడ్డిలు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్ మధురెడ్డి

అంకాలమ్మ తల్లిని దర్శించుకున్న ఎంపీ

మండలంలోని అంకాలమ్మగూడూరులో వెలసిన అంకాలమ్మ దేవతను ఆదివారం సాయంత్రం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిలు దర్శించుకున్నారు. వారు ఆలయానికి రాగానే ఆలయ చైర్మన్ అశోక్‌రెడ్డి ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం ఎంపీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బండలాగుడు పటీలను ఆయన తిలకించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ ఝాన్సీరాణి, నెడ్‌క్యాప్ రాష్ట్ర డైరెక్టర్ కిశోర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు హరినాథరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, రమణారెడ్డి, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు వారసత్వ దినోత్సవ ర్యాలీ

కడప కల్చరల్ : ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం భారత జాతీయ కళా వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు సంస్థ జిల్లా చాప్టర్ కన్వీనర్ ఎస్.ఎలియాస్‌రెడ్డి తెలిపారు. ఉదయం 7.15 గంటలకు ఎర్రముక్కపల్లెలోని అమర వీరుల స్మారక స్థూపం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమై కలెక్టరేట్ ప్రాంగణంలోగల మహావీర్ మ్యూజియం వద్దకు చేరుతుందన్నారు. అలాగే రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ వారసత్వ సంపదగా భావిస్తున్న రాయలసీమలోని కొన్ని అరుదైన వారసత్వ కట్టడాల ఫోటోలను ఆవిష్కరించనున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన్‌రాజు తెలిపారు.

బాలికల చదువు సమాజ పురోగతికి పునాది

వేంపల్లె : సమాజ పురోగతికి పునాది బాలికల చదువు అని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఏపీ రెసిడెన్షియల్ బాలికల ఉర్దూ పాఠశాలను ఆయన సందర్శించి అక్కడ ఉన్న విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు సంస్కారం, జ్ఞానంతోపాటు లోకజ్ఞానం పొందాలన్నారు. ముఖ్యంగా బాలికలు ఉన్నత లక్ష్యం, తపనతో ఉన్నత శిఖరాలు చేరాలంటే సున్నితమైన మనస్తత్వాన్ని వీడనాడి సమాజంలో ఎదుర్కొనే పేదరికాన్ని, అవమానాలను పాజిటివ్‌గా, చాలెంజ్‌గా తీసుకుని అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. ప్రతి విద్యార్థి సమాజం గురించి, సమాజంలో జరిగే సంఘటనల గురించి, పేదరికం గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి నిరంతర శ్రమ, సాధనలున ప్రధాన ఆయుధాలుగా మలుచుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సీఆర్పీ ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి ప్రభాకర్‌రెడ్డి

అగ్ని ప్రమాదాలు జరిగితే 101కు డయల్ చేయండి



పులివెందులలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



కమలాపురంలో ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలో చూపిస్తున్న సిబ్బంది

పులివెందుల రూరల్ : పట్టణంలోని జయమ్మ కాలనీలో ఆదివారం అగ్ని మాపక వారోత్సవాలలో భాగంగా గ్యాస్ లీకేజీ ప్రమాదాలపై ప్రజలకు అగ్ని మాపక సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్ని మాపక సిబ్బంది అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు నివారణా చర్యలు, గ్యాస్ ప్రమాదం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను డెమో ద్వారా తెలియజేశారు. అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి ఆఫీసర్ రామకృష్ణ మాట్లాడుతూ వంట పూర్తి చేసిన తర్వాత, రాత్రి సమయాలలో గ్యాస్ యొక్క రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజలు, మహిళలు, అగ్ని మాపక సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ లీకేజీ ప్రమాదాలపై అవగాహన

కమలాపురం : వంటింట్లో మహిళలు జాగ్రత్తలు పాటించి అగ్ని ప్రమాదాలను నివారించాలని, ఎల్‌పీజీ గ్యాస్ ప్రమాదాలు సంభవించినపుడు తక్షణం 101కు డయల్ చేయాలని ఎస్ఎఫ్ఓ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి జరుగుతున్న అగ్ని ప్రమాద వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం పట్టణ పరిధిలోని ఎండీఓ కాలనీలో మహిళలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిపించారు. ఈ సందర్భంగా వంటింట్లో లేదా ఎక్కడైనా అకస్మాత్తుగా మంటలు వ్యాపించగా తక్షణం 101కు డయల్ చేయాలన్నారు. తర్వాత ఇంటికి ఉన్న తలుపులు, వాకిళ్లు తెరిస్తే లీకైన గ్యాస్ బయటకు వెళ్తుందన్నారు. మహిళలు తమ వంట ముగియగానే రెగ్యులేటర్ ఆఫ్ చేయాలన్నారు. ఒక వేళ ఇండ్లకు తాళం వేసి ఇతర ఊర్లకు వెళ్లినపుడు రెగ్యులేటర్ ను పూర్తిగా సిలిండర్ నుంచి తీసి వేయాలన్నారు. గ్యాస్ గాలి కంటే బరువుగా ఉంటుంది కనుక అది కిందికే వెళు తుందని, అందు కోసం సిలిండర్ ఉంచే ప్రాంతంలో కింది భాగంలో ఒక చిన్న కిటికి ఉంచాలని, లీకైన గ్యాస్ ఈ కిటికీ గుండా బయటకు పోతుందన్నారు. వంటింట్లో జరిగిన అగ్ని, ఎలక్ట్రిక్ ప్రమాదాలను ఎలా ఆర్పాలి అనే అంశాలను ప్రత్యక్షంగా చేసి చూపించారు.

ప్రారంభమైన హేలాంబ తిరునాల

కమలాపురం : మండల పరిధిలోని పెద్దచెప్పలిలో వెలసిన ఎల్లమ్మ(హేలాంబ) తిరునాల ఘనంగా ప్రారంభమైంది. ఆదివారం ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ మాచునూరు ఇంద్రావతమ్మ ఆధ్వర్యంలో, ధర్మ కర్తల మండలి సభ్యుల పర్యవేక్షణలో భక్తుల సమక్షంలో ఎల్లమ్మను ప్రతిష్టించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. పెద్దచెప్పలిలో ప్రముఖ రంగ స్థల నటుడు, నంది అవార్డు గ్రహీత ఎల్.సుబ్బరాయుడు తన బృందంతో కలసి చెప్పిన ఎల్లమ్మ కథ భక్తులను ఆకట్టుకుంది.



పుష్పాలంకారంలో హేలాంబ అమ్మవారు

జార్జిరెడ్డి స్ఫూర్తితో ఉద్యమిద్దాం

కడప ఎడ్యుకేషన్: విప్లవ విద్యార్థి నాయకుడు, ఫిజిక్స్ గోల్డ్‌మెడల్ పీడీఎస్‌యూ వ్యవస్థాపకుడు కామ్రేడ్ జార్జిరెడ్డి నేటి యువతకు ఆదర్శం అని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న అన్నారు. ఆదివారం కడపలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జార్జిరెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంకన్న మాట్లాడుతూ నేడు నరేంద్రమోదీ ప్రభుత్వం విద్యా సంస్కరణల పేరుతో విశ్వ విద్యాలయాలలో అశాస్త్రీయ భావజాలాలను, మత చాందస్సును ప్రోత్సహిస్తుండడం దారుణమన్నారు. విద్యార్థి సంఘ నాయకులు జార్జిరెడ్డి స్ఫూర్తితో సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.